ప్రజారోగ్య రక్షణే ప్రభుత్వ ధ్యేయం



కొరగుంటపాలెం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్



గుడివాడలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీపీ, పక్కన నాయకులు

ముదినేపల్లి రూరల్: ప్రతి పేద కుటుంబానికి కార్పొరేట్ వైద్య సేవలందించాలనే ధ్యేయంతో ముఖ్యమంత్రి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే డీఎన్నార్ చెప్పారు. కొరగుంటపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే శనివారం ప్రారంభించి మాట్లాడారు. వైద్యం పేద కుటుంబాలకు ఆర్థిక భారం కాకూడదనే ధ్యేయంతో ముఖ్యమంత్రి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారన్నారు. శిబిరంలో ఏర్పాటుచేసిన కౌంటర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు మందుల కిట్లను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యన్నారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, సర్పంచ్ పేరే రామకృష్ణ, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, అల్లూరు, ఈడేపల్లి సర్పంచ్‌లు శీలం రామకృష్ణ, అబ్బిశెట్టి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు అచ్యుత రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు మోత్రు ఏసుబాబు, కోమటి విష్ణువర్ధన్, రంగిశెట్టి నరసింహారావు, గంటా కోటేశ్వరరావు, పేర్ని పృథ్వీ, దివి సతీష్, తహసీల్దార్ కే శ్రీనివాస్, డీఎల్పీవో పూర్ణ చంద్రరావు, ఈవోపీఆర్డీ డి.లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.

గుడివాడరూరల్: పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ మట్టా నాగమణివిక్టర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని వలివర్తిపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ గద్దే పుష్పరాణి, జెడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్‌పర్సన్, ఎంపీపీలు మాట్లాడుతూ పేద ప్రజలకు గ్రామస్థాయిలోనే కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. మోటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఈ క్యాంప్‌లో 470 మందికి వివిధ రకాల వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశామన్నారు. తహసీల్దార్ కె.ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గద్దే వెంకటరామాంజనేయులు(రాము), ఈవోపీఆర్డీ దేవరపల్లి వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు చింతా శ్రీను, మాజీ సర్పంచ్ శాయిన నాగబాబు, మాజీ ఉపసర్పంచ్ కందవల్లి రవికుమార్,పంచాయతీ కార్యదర్శి కె.అనూల. వైద్యులు, సచివాలయ ఉద్యోగులు, వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



గుడివాడలో మెడికల్ కిట్లు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్

గుడివాడ టౌన్: పట్టణంలోని 2, 9 వార్డుల సచివాలయాల పరిధిలో శనివారం జగనన్న సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. 2వ వార్డుకు సంబంధించి మాంటిస్సోరి తెలుగుమీడియం హైస్కూల్‌లో 9వ వార్డు ముగ్గుబజారు సచివాలయానికి సంబంధించి ఎన్టీఆర్ కాలనీ మున్సిపల్ ప్రైమరీ స్కూల్ ప్రాంగణంలో ఈ శిబిరాలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ ఈ వైద్యశిబిరాలను ప్రారంభించారు. మాంటిస్సోరి తెలుగు మీడియం హైస్కూల్‌లో పురుషులు 317, మహిళలు 308, మొత్తం 625 మందికి, ఎన్టీఆర్ కాలనీ ప్రైమరీ పాఠశాలలో పురుషులు 317, మహిళలు 357 మంది మొత్తం 674 మందికి వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి మున్సిపల్ కమిషనర్ మెడికల్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజస్వి, డాక్టర్ జయప్రద, డాక్టర్ సురేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు దుద్దు చిన్నా, పంచకర్ల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలను పర్యవేక్షించాలి

గుడివాడ ఆర్డీఓ పద్మావతి



సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీఓ, పాల్గొన్న అధికారులు

గుడివాడ టౌన్: దీపావళి పర్వదినం సందర్భంగా బాణసంచా హోల్‌సేల్ వ్యాపారులు, లైసెన్స్ పొందిన చిరువ్యాపారులు తీసుకోవలసిన సురక్షిత మార్గదర్శకాలను పర్యవేక్షించాలని ఆర్డీఓ పి.పద్మావతి సూచించారు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని రెవెన్యూ, పోలీస్, ఫైర్ తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ప్రధానంగా జనసంచారాలు ఉన్న చోట్ల దుకాణాలు ఏర్పాటు చేయకూడదన్నారు. హోల్‌సేల్ వ్యాపారులు విధిగా ఊరు బయట ఖాళీ ప్రదేశాల్లోనే వ్యాపారాలు చేయాలన్నారు. ప్రత్యేకించి అగ్నిమాపక శాఖ అధికారులు సూచనలు అమలయ్యేలా రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. ఏ ఒక్క విషయంలోనూ అలసత్వం ఉండకూడదని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి. మురళీకృష్ణ, వన్‌టౌన్, టూటౌన్, రూరల్ సీఐలు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఫైర్ ఆఫీసర్ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ



కొరగుంటపాలెంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: ముఖ్యమంత్రి జగనన్న మానస పుత్రిక సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువైనట్లు స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండలంలోని కొరగుంటపాలెంలో నూతన సచివాలయ భవనం, సీసీ రోడ్లను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయాల ఏర్పాటుతో ప్రజలకు 500 రకాల ప్రభుత్వ సేవలు స్థానికంగా అందుతున్నాయన్నారు. ఎలాంటి వివక్షకు తావులేకుండా పారదర్శకంగా సచివాలయ సిబ్బంది సేవలందిస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్లపై ప్రతిపక్ష నేతలు అవాస్తవ ప్రచారం, విమర్శలు చేయడం దారుణమన్నారు. ప్రజలకు సచివాలయ వ్యవస్థ ఎంతో ఉపయోగపడుతోందన్నారు. ఇంతటి ప్రజాభిమానం చూరగొన్న ఈ వ్యవస్థకు సొంత భవనాలు సమకూరడం హర్షణీయమన్నారు.

ఆలయంలో అన్నసమారాధన



వడ్డన చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

కలిదిండి: దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా కలిదిండిలో పల్లపు బజారు, అవకూరు గ్రామాల్లో నిర్వహించిన అన్న సమారాధనలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) శనివారం పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమా మహేశ్వరరావు, సర్పంచ్ నరహరిశెట్టి నరసయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు వడుపు రామారావు, వడ్డి గంగరాజు, ఉపసర్పంచ్ వడ్డి కాకాశేశ్వరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చన్నంశెట్టి కోదండ రామయ్య, నరహరిశెట్టి రాజు, చన్నంశెట్టి సురేష్, వడ్డి భోగేశ్వరరావు, మసిముక్కల వెంకటేశ్వరరావు, గుడివాడ ఫణి కుమార్, మారుబోయిన విష్ణు, మంగినేని భాస్కర్ పేటేటి సత్యనారాయణ, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అడ్డాడ(పామర్రు): గ్రామంలో వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి విశేషంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వచ్చినభక్తులు అందరికీ అన్న సమారాధన చేశారు. మల్లంపల్లి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు మల్లంపల్లి వెంకట్రావు సౌజన్యంతో ఆలయ పునఃనిర్మాణం, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. ఈ అన్నదానంలో సుమారు 900 మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అడ్డాడ గ్రామ సర్పంచ్ పామర్తి త్రినేత్రి, స్థానికోఎ పీఏసీఎస్ అధ్యక్షుడు బలుసు హరికిరణ్, స్థానికులు చలసాని శ్రీ కృష్ణ, గుత్తికొండ సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

కైకలూరు: దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక వెలంపేటలో శనివారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ప్రారంభించారు. తొలుత ఆయన అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ స్థానిక నేతలు పాల్గొన్నారు.

హోమియో వైద్య విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, వైద్య విద్యార్థులు

గుడివాడ టౌన్: హోమియో ప్రాంతీయ పరిశోధనా సంస్థ గుడివాడ హోమియో కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం వైద్యులు, వైద్య విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఫిట్ ఇండియా స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్ నిర్వహించినట్లు పరిశోధనా సంస్థ ఇన్‌చార్జ్ డైరెక్టర్ డాక్టర్ బీఎస్‌జే రాజ్‌కుమార్ తెలిపారు. స్థానిక పరిశోధనా సంస్థ నుంచి ఏలూరు రోడ్, నెహ్రూచౌక్ వరకు ఈ ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో పరిశోధనా సంస్థ వైద్యులు డాక్టర్ కిషన్ బానోత్, డాక్టర్ రాజశేఖర్, హోమియో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సాంబమూర్తి, సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, ఇతర వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా రక్షణ భేరి పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

గుడివాడ టౌన్: మతోన్మాద బీజేపీని ఓడించేందుకు నవంబర్ 15వ తేదీన విజయవాడలో జరిగే ప్రజా రక్షణ భేరి విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి కోరారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో రక్షణభేరి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా ద్రోహం చేసిన పార్టీ బీజేపీ అన్నారు. ఈ విషయాలను ప్రజలకు తెలియజేసేందుకు జరుగుతున్న ఈ రక్షణభేరి విజయవంతం కావడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ భారీ బహిరంగసభలో సీపీఎం ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారామ్, రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పాల్గొంటారన్నారు. సీపీఎం నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా కార్యదర్శి పి.రజిని, ఎస్ఎఫ్ నాయకులు ఎస్. సమరం, సీపీఎం నాయకులు వై.యేషయ్య, ఎల్.సురేంద్ర, కె. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్

పెదపారుపూడి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ వి.నాగభూషణం వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహర్షి వాల్మీకి జీవితం ఎంతో మందికి ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రవికుమార్, డివిజన్ వీఆర్వో సంఘ అధ్యక్షుడు చాట్ల అజయ్‌కుమార్, సర్వేయర్ అప్పారావు, వీఆర్వో వెంకటచారి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుడివాడ టౌన్: గురు భక్తికి నిదర్శనం వాల్మీకి అని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత మున్సిపల్ ఉద్యోగులు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పట్టుదల, దీక్ష కార్యసాధనకు వాల్మీకి ఒక నిదర్శనం అన్నారు. యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ టీవీ రంగారావు, అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ జాబితా ప్రదర్శన



మాట్లాడుతున్న ఏఓ సునీల్

పామర్రు: మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల వద్ద పంట నమోదు చేసిన రైతులు, పంట వివరాలను సామాజిక తనిఖీ కోసం ముసాయిదా జాబితాను ప్రదర్శిస్తున్నట్లు పామర్రు ఏవో శివ నాగరాణి శనివారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఆదివారం వరకు జాబితాలను ప్రదర్శిస్తామన్నారు. రైతులు అందరూ పంట నమోదు వివరాలను సరి చూసుకుని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్థానిక ఆర్బీకేలో తెలియజేయాలని అన్నారు. రైతు పేరు, పంట రకం, విస్తీర్ణం తదితరాలను సరి చేసుకోవాలని తెలిపారు. ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులకు వ్యవసాయశాఖ పథకాలకు అర్హులు అవుతారని తెలిపారు. ఈకార్యక్రమంలో వీఏఏ కిరణ్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: ఖరీఫ్ సాగుకు సంబంధించి ఈ క్రాఫ్ నమోదుతో పలు ప్రయోజనాలున్నట్లు మండల వ్యవసాయాధికారి కే విద్యాసాగర్ అన్నారు. మండలంలోని ఆవకూరులో గ్రామసభ శనివారం నిర్వహించారు. సభలో పాల్గొన్న వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఈ క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతుల పేర్లకు సంబంధించి రైతు భరోసా కేంద్రాల వద్ద జాబితాలను ప్రదర్శించామన్నారు. ఈ జాబితాలను సరిచూసుకొని సవరణలుంటే స్థానిక వ్యవసాయ సహాయకులకు సమాచారం అందించి సవరణ చేయించుకోవాలన్నారు.

గుడ్లవల్లేరు: పంట వివరాల జాబితాలపై డోకిపర్రు, శేరీ దగ్గుమిల్లిలోని రైతులకు ఏఓ ఎల్.సునీల్ శనివారం అవగాహనా కార్యక్రమాన్ని చేపట్టారు. గుడ్లవల్లేరు మండలంలోని 22 వేల ఎకరాల్లో పంట వివరాలపై ఆర్బీకేల్లో పంట నమోదు జాబితాలను ఉంచామని ఆయన చెప్పారు. ఈ కేవైసీ ప్రక్రియ కూడా పూర్తి చేశామన్నారు. ఆర్బీకేల్లో రైతులు జాబితాలను పరిశీలించుకుని తమ పంట వివరాలపై అభ్యంతరాలను సరిజేసుకోవాలని కోరారు. ఆదివారం లోగా వివరాలను అందిస్తే తాము తుది జాబితాలను ప్రభుత్వానికి నివేదిస్తామని వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొండలమ్మ ఆలయంలో పౌర్ణమి పూజలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

గుడ్లవల్లేరు: వేమవరం కొండలమ్మ ఆలయ ప్రాంగణంలో పౌర్ణమి ప్రత్యేక పూజలను శనివారం ఉదయం వేద పండితులు నిర్వహించారు. అనంతరం చండీ హోమాన్ని వేద మంత్రోచ్చరణల మధ్య చేపట్టారు. పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారి భక్తుల సర్వ శ్రేయస్సు, ఆయురారోగ్య ఐశ్వర్య అభివృద్ధికి ఈ హోమాన్ని చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి, ధర్మకర్తలు కొమ్మన బోయిన రవిశంకర్ దంపతులు, బాడిగ లీలా సౌజన్య దంపతులు, ఆలయ అర్చకుడు శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

చంద్ర గ్రహణంతో ఆలయం మూసివేత..


పాక్షిక చంద్ర గ్రహణంతో శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి కొండలమ్మ ఆలయాన్ని మూసివేశారు. సంప్రోక్షణ అనంతరం ఆదివారం ఉదయం 8గంటల నుంచి ఆలయం తెరవబడుతుందని ఈఓ సురేష్ తెలిపారు. అమ్మవారి పునఃదర్శనం భక్తులకు ఇస్తారని పేర్కొన్నారు.

పామర్రు మండలంలో..

పామర్రు: మండల పరిధిలో ఆలయాలను శనివారం చంద్రగ్రహణం సందర్భంగా మూసివేశారు. అన్ని ఆలయాలలను ఉదయం దూపదీప నైవేద్యాలను సమర్పించి అంనతరం ఆలయాలను మూసివేశారు. గ్రహణం రాత్రి 1-03 నిమిషాలకు ప్రారంభమై రాత్రి 2-22 గంటలకు విడుస్తుందని తెలుపుతున్నారు. ఆదివారం ఉదయం ఆలయాల్లో సంప్రోక్షణ చేసి పూజాధి కాలు పూర్తి చేసి భక్తులకు స్వామి వార్ల దర్శనం కల్పిస్తారు.

మొవ్వ: మండలంలోని పలు దేవాలయాలను శాస్త్రోక్తంగా మూసివేశారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం వేకువ జామువరకు పాక్షిక చంద్రగ్రహణం కొనసాగనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా కూచిపూడి నాట్యాచార్యుల ఇలవేలుపైన శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయానికి అర్చకులు పెనుమూడి పూర్ణచంద్ర శేఖర శర్మ, ఆలయ కమిటీ అధ్యక్షులు కావూరి మూర్తిలు ఆలయానికి తాళాలు వేశారు. ఆదివారం ఉదయం 5గంటల అనంతరం సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఆనందోత్సాహాలతో ఫ్రెషర్స్ డే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ ప్రసాదరావు

గుడివాడ టౌన్: స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే ఆనందోత్సాహాలతో జరిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ హెచ్‌వీ ప్రసాదరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంజినీరింగ్, ఎంబీఏ మొదటి సంవత్సర విద్యార్థులకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా అన్ని శాఖల హెచ్ఓడీలు, అధ్యాపకులు మాట్లాడుతూ సీనియర్లు జూనియర్లకు ఆదర్శంగా నిలవాలన్నారు. సీనియర్లు వారి అనుభవాలను జూనియర్లతో పంచుకుంటూ వారికి అన్ని విధాలా సహకారం అందించాలన్నారు. అప్పుడే విద్యార్థులు సమతుల్యం పాటించినట్లవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వేములపల్లి కోదండ రామయ్య, డైరెక్టర్ బి. కల్యాణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు ఆధార్ శిబిరం



ఆధార్ శిబిరంలో పాల్గొన్న పారిశుద్ధ్య కార్మికులు

కైకలూరు: మండలంలోని ఆటపాక పారిశుద్ధ్య కార్మికులకు శనివారం ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహించారు. ప్రాజెక్ట్ నవయాన్ ఆధ్వర్యంలో ఈ క్యాంపు నిర్వహించారు. నవయాన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగలపూడి విజయ్ ప్రత్యేక ఆధార్ క్యాంపును పరిశీలించారు. కైకలూరు పోస్టాఫీస్ మేనేజర్ దానం ఆనందం వినయ్‌కుమార్ సహకారంతో ఈ క్యాంపును నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటపాక సర్పంచ్ తలారి మణిమ్మ, వీఆర్వో కృష్ణప్రసాద్, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎస్ఏఈ అవార్డు స్వీకరణ



గుడ్లవల్లేరు: సొసైటీ ఆఫ్ ఆటోమోటివ్ ఇంజినీర్స్(ఎస్ఏఈ) ఇంటర్నేషనల్, యూఎస్ఏ అనుబంధ సంస్థ ఏటా ఇచ్చే ఎస్ఏఈ లీడర్ షిప్ అవార్డు 2022-23 సంవత్సరానికి శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ సలహాదారుడు డాక్టర్ పి.రవీంద్రబాబును వరించింది. ఈ విషయాన్ని ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ప్రసాద్ శనివారం తెలిపారు. చెన్నైలో గురువారం నిర్వహించిన ఎస్ఏఈ ఇండియా సదస్సులో ఇంటర్నేషనల్ గ్లోబల్ ఎడ్వైజర్ డాక్టర్ మురళీ అయ్యర్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నట్లు పేర్కొన్నారు. అవార్డు గ్రహీతను కాలేజీ చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణ, సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ తదితరులు అభినందించారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

మచిలీపట్నంటౌన్: జిల్లా స్థాయి ఖాదీ మహోత్సవంలో భాగంగా శనివారం స్థానిక రుస్తుంబాద పార్కులోని నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీలను సమగ్ర శిక్ష ఇన్‌చార్జి అసిస్టెంట్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎం.ఫణిదూర్జటి ప్రారంభించారు. వివిధ కేటగిరీల్లో విజేతల వివరాలను స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయానికి పంపామని ఫణిదూర్జటి తెలిపారు. మండల పరిధిలోని విద్యార్థులకు ఖాదీ మహోత్సవంలో భాగంగా స్థానిక షార్కీ మెమోరియల్ బాలికల హైస్కూల్‌లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు జరిగాయి. పోటీలను ఎంఈఓ దుర్గాప్రసాద్ పర్యవేక్షించారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలలో పోటీలు నిర్వహించి విజేతల జాబితాను జిల్లా అధికారులకు పంపామని ఆయన తెలిపారు.

క్లుప్తంగా

వలంటీర్ల ఎంపికకు ఇంటర్వ్యూలు



ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల ఎంపిక కోసం ఇంటర్వ్యూలు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. మండలంలోని ముదినేపల్లి, ఈడేపల్లి, కోడూరు, వడాలి, పెనుమల్లిలో వలంటీర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇన్‌చార్జి ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. నిబంధనల మేరకు విద్యార్హతలు, ఇతర అర్హతలు ఉన్నవారిని పారదర్శకంగా ఈ పోస్టులకు ఎంపిక చేస్తామని రమణరావు తెలిపారు.

ఈకేవైసీ పూర్తి చేయండి..

ఆయుష్మాన్ భారత్‌కు సంబంధించి నూరు శాతం ఈకేవైసీలను వెంటనే పూర్తి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సూచించారు. ఇందుకు సంబంధించి శ్రీహరిపురం, సింగరాయపాలెం, వడాలి సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న ఈకేవైసీ ప్రక్రియను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడంతో పాటు ఆయుష్మాన్ భారత్ ఈకేవైసీ వారంలోపు పూర్తిచేయాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు సూచించారు.

అన్నదానానికి విరాళం



గుడివాడ టౌన్: స్థానిక జగన్నాథపురం పాటి మీద వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అన్నదానం నిమిత్తం భక్తులు విరాళం అందజేశారు. శనివారం స్థానిక ఆలయంలో జరిగిన సమావేశంలో వీర్ల శ్రీరామ్ యాదవ్ - సీతా మహాలక్ష్మి కుమారుడు వీర్ల బాలసాయి సుబ్రహ్మణ్యం రూ.91 వేల 667 విలువైన చెక్కును వితరణగా అందజేశారు. ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం ఈ చెక్కును స్వీకరించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ప్రతి శనివారం ఆలయంలో జరిగే అన్నదానం కార్యక్రమానికి ఈ మొత్తాన్ని వినియోగిస్తామని తెలిపారు.

బహిరంగ సభాస్థలం పరిశీలన



పామర్రు: ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించేందుకు నవంబరు 9వ తేదీన పామర్రులో సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పామర్రులో నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభకు శనివారం స్థల పరిశీలన చేశారు. స్థానిక గుడివాడరోడ్డులోని సచివాలయం-1 దగ్గర ఉన్న వైఎస్సార్ కాంస్య విగ్రహం వద్ద బహిరంగసభ ఏర్పాటు చేసేందుకు స్థలం అనుకూలంగా ఉందని గుర్తించారు. నాలుగు రోడ్లలో ఉన్న ప్రజలకు సభను చూసేందుకు అవకాశం ఉంటుందని, ట్రాఫిక్‌కు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా తగు విధమైన చర్యలు తీసుకుంటామని గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే సోదరుడు కై లే జగదీష్, పామర్రు సీఐ వీ సుభాకర్, గ్రామ ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ టీ శ్రీనివాసరావు, పార్టీ నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, వల్లభనేని బుల్లిబాబు పాల్గొన్నారు.

మెప్మా బజార్ ప్రారంభం



గుడివాడ టౌన్: మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి స్వయం పోషక సంఘం వారి వెసులుబాటును బట్టి ఇక్కడ వ్యాపారాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని పెట్టుబడిగా పెట్టి ఆర్థికంగా ఎదిగేందుకు ఈ చిరువ్యాపారాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. పట్టణ ప్రజలు సైతం వీటిని ప్రోత్సహించాలన్నారు. ఇక్కడ స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన పచ్చళ్ళు, పిండి వంటలు, జూట్ బ్యాగ్స్, ఫ్యాన్సీ వస్తువులతో పాటు తక్కువ ధరకు అనేక వస్తువులు ఇక్కడ విక్రయించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ మెప్మా బజార్ అభివృద్ధికి చేయూత ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మెప్మా మేనేజర్ జీఎస్ సుజాత, అసిస్టెంట్ కమిషనర్ టీవీ రంగారావు, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు మాదాసు వెంకటలక్ష్మీకుమారి, తదితరులు పాల్గొన్నారు.